సాక్షి
పార్వతీపురం మన్యం

శనివారం । 1 । మార్చి । 2025

ముగిసిన స్టెప్‌కాన్ సదస్సు



రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ ఐటీలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న స్టెప్‌కాన్-2025 జాతీయ సదస్సు శుక్రవారంతో ముగిసింది. ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ స్టెప్‌కాన్ కేవలం సాంకేతిక అంశం మాత్రమే కాదని, దానికి బహుముఖ ప్రాధాన్యం చేకూరిందన్నారు. రానున్న రోజుల్లో టెలీ పోర్టేషన్ సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. నూతన సాంకేతిక విప్లవం ద్వారా కొత్త రకాలైన ఉద్యోగావకాశాలు రానున్నాయని, వాటిని పొందాలంటే జ్ఞానం పొందడంతో పాటు నైపుణ్యం సాధనకు ప్రయత్నించాలన్నారు. విద్యార్థులందరికీ విశేషమైన శక్తిసామర్థ్యాలు ఉన్నాయనడానికి రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఈ సదస్సులోని ప్రదర్శనలే నిదర్శనమన్నారు. దేశం నలుమూలల నుంచి 3,884 మంది విద్యార్థులు ఈ సదస్సులో పాల్గొని, వివిధ అంశాలు ప్రదర్శించారన్నారు. అనంతరం విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు అందించారు. విశాఖపట్నం విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన దాసరి సాయిప్రవీణ్‌కు పద్మశ్రీ డాక్టర్ ఎన్.ప్రభాకర్ మెమోరియల్ అవార్డు అందించారు.

న్యూస్‌రీల్

ఇంటర్మీడియట్ పరీక్షలకు వేళాయె

- పరీక్షలు రాయనున్న 17,849 మంది విద్యార్థులు
- జిల్లాలో 34 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు

పార్వతీపురంటౌన్: ఇంటర్మీడియట్ పరీక్షలకు వేళయింది. శనివారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 82 కళాశాలలకు చెందిన 17,849 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. వీరిలో 8,968 మంది మొదటి సంవత్సరం, 8,881 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉన్నారు. వీరి కోసం 34 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 500 మంది ఇన్విజిలేటర్లు, 34 మంది పర్యవేక్షకులు, డిపార్టుమెంట్ అధికారులు, ఇద్దరు సిట్టింగ్, ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. ప్రశ్నపత్రాల కోసం 15 స్టోరేజీ పాయింట్లు సిద్ధం చేశారు. జిల్లా, రాష్ట్రస్థాయిలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్‌ల నుంచి సీసీ కెమెరాల సాయంతో పరీక్షలను పర్యవేక్షించనున్నారు. పరీక్షలకు వచ్చే విద్యార్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకురావద్దని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు పూర్తిచేసినట్టు జిల్లా ఇంటర్మీడియల్ విద్యాశాఖాధికారి మంజుల వీణ తెలిపారు.

పశువైద్య విద్యార్థుల డిమాండ్లు నెరవేర్చాలి



కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

పార్వతీపురం టౌన్: రాష్ట్రంలో పశువైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల న్యాయమైన డిమాండ్‌లను నెరవేర్చాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేంకటేశ్వర యూనివర్సిటీ పరిధిలోని తిరుపతి, పొద్దుటూరు, గన్నవరం, గరివిడి విద్యార్థులు ఫిబ్రవరి 3వ తేదీ నుంచి తరగతులు బహిష్కరించి సమ్మె, రిలే దీక్షలు చేస్తున్నా పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. ఇంటర్న్‌షిప్ చేసేవారికిచ్చే స్టైఫండ్ 2013వ సంవత్సరం నుంచి రూ.7,000 నుంచి రూ.12,000 మధ్యనే ఉందన్నారు. జనరల్ వైద్య విద్యను అభ్యసించే విద్యార్థుల స్టైఫండ్ రూ.25 వేల నుంచి రూ.65వేలకు ప్రభుత్వం పెంచిందన్నారు. పశు వైద్యశాలలో ఖాళీగా ఉన్న పశువైద్య పోస్టులను తక్షణమే భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కిరణ్, తదితరలు పాల్గొన్నారు.

జోగిరాజుపేటలో ఏనుగులు



జోగిరాజుపేట పంట పొలాల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి పంచాయతీ జోగిరాజుపేట, కన్నపుదొరవలస పంచాయతీల పరిధిలోని పంట పొలాల్లో ఏనుగులు శుక్రవారం సంచరించాయి. ఉదయం సుభద్రమ్మవలస వద్ద ఉన్న మొక్కజొన్న పంటను నాశనం చేయడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఇప్పుడు జోగిరాజుపేట వైపు రావడంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. అటవీ సిబ్బంది ఏనుగులను కాపలాకాస్తున్నారే తప్ప తరలించే ప్రయత్నం చేయడంలేదని వాపోతున్నారు.

పూతిక వలసలోనూ..

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలం పూతికవలస గ్రామ సమీపంలోని పామాయిల్, అరటి తోటల్లో మరో ఏనుగుల గుంపు సంచరిస్తుండడంతో అక్కడి రైతులు కలవరపడుతున్నారు.

ఇది వంచన బడ్జెట్



కూటమి ప్రభుత్వం 2025–26 ఆర్థిక సంవత్సరానికి అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలకు వంచన గ్యారెంటీ అన్న చందంగా ఉంది. మహిళలు, నిరుద్యోగులు, రైతన్నలు, ఎస్సీ,ఎస్టీ, బీసీ వర్గాల సంక్షేమాన్ని కనీసం పట్టించుకోలేదు. రాష్ట్రంలో ఉన్న 66 లక్షల మంది పింఛన్‌దారులకు ఏడాదికి రూ.32 వేల కోట్ల బడ్జెట్ అవసరం కాగా కేవలం రూ.27వేల కోట్లే కేటాయించింది. అంటే భవిష్యత్తులో పింఛన్ల తొలగింపు తప్పదని బడ్జెట్ రూపంలోనే చెప్పింది. తల్లికి వందనం పథకానికి ఏడాదికి రూ.12 వేల కోట్ల అవసరం కాగా కేవలం రూ.9వేల కోట్లు కేటాయించింది. ఇక్కడా కోత తప్పదు. నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 50 ఏళ్ల వయసు దాటిన బీసీలకు పింఛన్ మంజూరు వంటి హామీల అమలు ఊసేలేదు. అబద్ధపు హామీలతో సీఎం నారా చంద్రబాబు నాయుడు మరోసారి ప్రజలను నిలువునా ముంచేశారు.

– అలజంగి జోగారావు, మాజీ ఎమ్మెల్యే, పార్వతీపురం

ఆరు హామీలు కాదు.. ఆరు మోసాలు



ఎన్నికల సమయంలో తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మూడు ఉచిత గ్యాస్ సిలండర్లు... ఇలా కూటమి నాయకులు ట్రిపుల్ ఇంజన్ అంటూ ప్రచారం చేశారు. నేడు బడ్జెట్ సాక్షిగా హామీలు అమలు చేయలేమని చెతులెత్తేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చినవి ఆరు హామీలు కాదు...అవి ఆరు మోసాలుగా ప్రజలు గుర్తించాలి.

– విశ్వాసరాయి కళావతి, మాజీ ఎమ్మెల్యే, పాలకొండ నియోజకవర్గం


అరచేతిలో వైకుంఠం...
అమల్లో ఎగనామం!

- కూటమి ప్రభుత్వ వార్షిక బడ్జెట్‌పై సర్వత్రా విమర్శలు
- సూపర్ సిక్స్ అమలుపై కరిగిపోయిన సామాన్యుల ఆశలు
- 2025–26 పూర్తిస్థాయి బడ్జెట్‌లో కనిపించని సంక్షేమ పథకాలు
- ప్రస్తావించిన అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలపైనా సందేహాలు
- అమలయ్యేవరకూ చెప్పలేమంటున్న ప్రజానీకం
- అన్నీ కంటితుడుపు కేటాయింపులేనని పెదవి విరుపు



సాక్షి ప్రతినిధి, విజయనగరం:

టీడీపీ, జనసేన, బీజేపీ కలగలిపిన కూటమి ప్రభుత్వం మాది. అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో అధికారం తమదే..డబుల్ ఇంజిన్ సర్కార్ అంటూ టీడీపీ, జనసేన నాయకులు చెప్పుకొనే గొప్పలు చూస్తే అబ్బో అనిపిస్తాయి! తీరా రాష్ట్ర బడ్జెట్ చూస్తే మాత్రం అంతా అంకెల గారడీనే కనిపిస్తుందని విపక్షాలు విరుచుకుపడుతున్నాయి. వైఎస్సార్‌సీపీ అమలుచేసిన సంక్షేమ పథకాలను కొనసాగిస్తామని, అంతకుమించి సూపర్ సిక్స్ పథకాలను అమలుచేస్తామని గత సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో టీడీపీ, జనసేన నాయకులు అరచేతిలో వైకుంఠం చూపించారు. తీరా అధికారంలోకి వచ్చాక హామీలకు ఎగనామం పెట్టేశారు. అదిగో ఇదిగో అంటూ కాలక్షేపం చేస్తున్నారు. ఇక రానున్న సంవత్సరం కూడా సూపర్ సిక్స్ పథకాలు అందవన్న విషయం శుక్రవారం నాటి రాష్ట్ర బడ్జెట్ ప్రతిపాదనలు చూసిన తర్వాత స్పష్టమైంది. సామాన్యుల ఆశలు కరిగిపోయాయి. గత ఏడాది నవంబర్‌లో ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్‌లోనే అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలను ప్రస్తావించినా తర్వాత వాటి ఊసే లేదు. వాటినే మళ్లీ తాజా పూర్తిస్థాయి బడ్జెట్ 2025–26లోనూ ప్రతిపాదించినా అరకొర నిధులే కేటాయించడంతో అవెంత వరకూ అమలుచేస్తారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సూపర్ సిక్స్‌లోని మిగతా సంక్షేమ పథకాలకు సంబంధించిన ప్రతిపాదనలేవీ లేవు. దీంతో ఈ బడ్జెట్ సామాన్యులకు కంటితుడుపు మాదిరిగానే ఉందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌పై ఉభయ విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల ప్రజలు పెదవి విరుస్తున్నారు.



రైతులకు సాయం అందేనా?

పెట్టుబడి సాయం కింది ప్రతి రైతు కుటుంబానికి ఏటా రూ.20 వేల చొప్పున అందిస్తామనేది టీడీపీ, జనసేన నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీ. గత తాత్కాలిక బడ్జెట్‌లోనే ఇస్తామని ప్రతిపాదించినా ఒక్క పైసా కూడా రైతులకు ఇవ్వలేదు. ఈసారి బడ్జెట్‌లో రాష్ట్రంలో 53.5 లక్షల మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద దఫదఫాలుగా సాయం అందించేందుకు రూ.6,300 కోట్లు ప్రతిపాదించారు. అమలయ్యేవరకూ అనుమానమే. రైతు సేవా కేంద్రాలుగా పేరుమార్చిన రాష్ట్రంలోని 10778 రైతుభరోసా కేంద్రాలకు నిర్వహణ ఖర్చుల కింద కేవలం రూ.19.42 కోట్లు మాత్రమే ప్రతిపాదించారంటే... వాటిని మరింత నిర్వీర్యం చేయడానికేనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వ్యవసాయాధారిత విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో రైతులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇవెంతగానే ఉపయోగపడిన విషయం తెలిసిందే. మార్కెట్లలో వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పడిపోతే కొనుగోలు చేసి రైతులను ఆదుకొనేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సుమారు రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో కేవలం రూ.300 కోట్లు మాత్రమే ప్రతిపాదించింది.

సాగునీటి పథకాలకు అరకొరగా నిధులు..

దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి ఉమ్మడి విజయనగరం జిల్లాలో జలయజ్ఞంలో భాగంగా తలపెట్టిన సాగునీటి ప్రాజెక్టు పనులను పూర్తి చేయడమే లక్ష్యంగా ఆయన కుమారుడు, గత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిధులు కేటాయిస్తూ వచ్చారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రాజెక్టుల పనులపై కినుక వహించింది. కాలువల నిర్మాణానికి సంబంధించి జంఝావతి, తోటపల్లి కొత్త ఆయకట్టుతో కలిపి వెంగళరాయసాగర్ విస్తరణకు అవసరమైన 21 ఎకరాల భూసేకరణకు, తారకరామతీర్థ సాగరం ప్రాజెక్టు మిగులు పనులకు, తోటపల్లి బ్యారేజ్ ప్రాజెక్టు గజపతినగరం బ్రాంచ్ కెనాల్‌కు అవసరమైన 240 ఎకరాల భూసేకరణకు, పాత తోటపల్లి బ్యారేజ్ ఆధునికీకరణ, పెద్దేరు రిజర్వాయరు, మడ్డువలస రిజర్వాయరు మిగులు పనులన్నింటికీ కలిపి కేవలం రూ.54.73 కోట్లు మాత్రమే ప్రతిపాదించడమే దీనికి నిదర్శనం. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు రూ.605.75 కోట్లు, తోటపల్లి బ్యారేజ్ ప్రాజెక్టుకు రూ.47.80 కోట్లు ప్రతిపాదించారు. మిగులు పనులు, నిర్వాసితులకు పరిహారం చెల్లింపునకు కలిపి తారకరామతీర్థ సాగరం ప్రాజెక్టుకు రూ.68 కోట్లు కేటాయించారు.

మరికొన్ని కేటాయింపులు...

- భోగాపురం ఎయిర్‌పోర్టు అనుసంధాన రహదారి నిర్మాణానికి ఇంకా 40 ఎకరాల భూసేకరణకు సంబంధించి రూ.195 కోట్లు ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించారు.
- పార్వతీపురం మన్యం జిల్లా సహా రాష్ట్రంలోని నాలుగు జిల్లాల్లో నెలకొన్న ఏనుగుల సమస్యను పరిష్కరించేందుకు ఉద్దేశించిన ప్రాజెక్టు ఎలిఫెంట్‌కు కేవలం రూ.1.28 కోట్లే కేటాయించారు.
- విజయనగరంలోని జేఎన్‌టీయూ–గురజాడ ఇంజనీరింగ్ విశ్వవిద్యాలయంలో మౌలిక వసతుల కల్పనకు సాయంగా సుమారు రూ. 5.60 కోట్లు ప్రతిపాదించారు. దీంతో పాటు కురుపాంలోని గిరిజన ఇంజనీరింగ్ కళాశాలకు కలిపి భవనాలు, ల్యాబ్‌ల నిర్మాణం కోసం మరో రూ.3.40 కోట్లు కేటాయించారు.
- విజయనగరం శివారులోని కోరుకొండ సైనిక్‌స్కూల్‌తో పాటు కలికిరి సైనిక్ స్కూల్‌కు కలిపి అదనపు నిర్మాణాల కోసం రూ.2 కోట్లు ప్రతిపాదించారు.
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గిరిజన ప్రాంతాలైన సీతంపేట, పార్వతీపురంతో పాటు మరో మూడు ప్రాంతాల్లో నిర్మించ తలపెట్టిన మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులకు రూ.110 కోట్లు ప్రతిపాదించారు.
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్మించిన విజయనగరం సహా రాష్ట్రంలోని మరో ఆరు బోధనా సుపత్రులకు కలిపి రూ.375 కోట్లు మాత్రమే ప్రతిపాదించారు. అరకొర నిధులతో విజయనగరం మెడికల్ కాలేజీలో రెండో దశ నిర్మాణాలు వేగవంతమయ్యే అవకాశం కనిపించట్లేదు.

కోతల బడ్జెట్



సంపద సృష్టించి సంక్షేమాన్ని ప్రజలకు చేరువచేస్తామన్నారు. ద్రవ్య, రెవెన్యూ లోటే చూపించారు. సంక్షేమ పథకాల అమలులో కోతలు తప్పవని బడ్జెట్ సాక్షిగా చెప్పారు. నిరుద్యోగ భృతి, ఉద్యోగాకల్పన ఊసే లేదు. – పాలవలస విక్రాంత్, రాష్ట్ర శాసన మండలి సభ్యుడు

మాయా బడ్జెట్



టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మహిళలకు మొండిచేయి చూపారు. ఉచిత బస్సు సదుపాయం, 18 నుంచి 60 సంవత్సరాల మధ్య మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామన్నా పథకాల ఊసేలేదు.

– బద్నాన ప్రమీల, ఎంపీపీ పాచిపెంట

నిరాశ జనక బడ్జెట్

ఉద్యోగులకు ఇది నిరాశాజనక బడ్జెట్. పీఆర్‌సీ బకాయిలు, డీఏలు, తదితర కేటాయింపులు లేకపోవడం విచారకరం.

– ఎ.సూర్యనారాయణ, పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు

అంకెల గారడీ



కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉత్తరాంధ్రకు ఎటువంటి ప్రయోజనం లేదు. తోటపల్లి కాలువల ఆధునికీకరణకు రూ.30 కోట్లు కేటాయిస్తున్నామన్నారు. ఆ మొత్తంలో రూ.4 కోట్లతో పూడిక తీతలు చెపడతామన్నారు. నేటికీ ఎక్కడా పనులు జరగలేదు. ప్రస్తుత బడ్జెట్‌లోనూ ప్రాజెక్టుల పూర్తికి సరిపడా నిధులు కేటాయించలేదు. – **బుడితి అప్పలనాయుడు, ఏపీ రైతుసంఘం ప్రధానకార్యదర్శి, పార్వతీపురం మన్యం జిల్లా**

బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీలా బడ్జెట్



2025–26 బడ్జెట్ బాబు ష్యూరిటీ.. మోసం, నయవంచన గ్యారంటీలా ఉంది. ఎన్నికల్లో ప్రతి గ్రామానికి వెళ్లి అధికారంలోకి రాగానే సూపర్ 6 అమలు చేస్తామని చెప్పుకొచ్చారు. రూ.3 లక్షల 22వేల కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సూపర్ 6 పథకాలకు ఎగనామం పెట్టారు. నిరుద్యోగ భృతి, మహిళలకు నెలకు రూ.1500, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్లు, ఉచిత బస్సు వంటి పథకాలకు బడ్జెట్‌లో ప్రస్తావనే లేకుండాపోయింది. అన్నదాత సుఖీభవకు రూ.11 వేల కోట్లు అవసరమైతే కేవలం రూ.6,300 కోట్లు మాత్రమే కేటాయించారు.

– పాముల పుష్పశ్రీవాణి, మాజీ డిప్యూటీ సీఎం

అప్పుల ఆంధ్రప్రదేశ్ ఘనత
చంద్రబాబుదే



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

- రూ.లక్ష కోట్లు అప్పుచేసిన చంద్రబాబుకు ఇప్పుడు వెనుజులా, శ్రీలంక గుర్తురాలేదా?
- జగన్ చేసిన అప్పులకు లెక్కలున్నాయి
- చంద్రబాబుచేసిన అప్పులకు లెక్కలు చూపించగలరా?
- బడుగు బలహీనవర్గాలతో మూడు ముక్కలాట ఆడుతున్న కూటమి ప్రభుత్వం
- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు రూరల్: రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనత సీఎం చంద్రబాబుదేనని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర విమర్శించారు. పేదలకు సంక్షేమ పథకాలు అందించేందుకు, అభివృద్ధి పనులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అప్పులుచేస్తే ఆంధ్రప్రదేశ్ ఒక వెనుజులా, మరో శ్రీలంకగా తయారవుతుందని ఆరోపించిన చంద్రబాబు నాయుడు... ఇప్పుడు తను చేస్తున్న అప్పులు ఎవరి కోసం చేస్తున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సాలూరులోని తన నివాసంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తామని ఎన్నికల్లో లబ్ధిపొందిన చంద్రబాబు... ఇప్పుడు ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా అమలు చేయకుండా మోసం చేశారన్నారు. ప్రజావ్యతిరేకతకు భయపడి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలుచేస్తున్నారన్నారు. అసెంబ్లీలో ప్రశ్నిస్తారన్న భయంతో వైఎస్సార్‌సీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వడంలేదన్నారు. ఢిల్లీలో ముగ్గురు ఎమ్మెల్యేలు ఉన్న బీజేపీకి గతంలో ప్రతిపక్ష హోదా ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల సమక్షంలో ఎండగడతామన్నారు. తొమ్మిది నెలల పాలనలో కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసినది శూన్యమన్నారు. గతంలో కేవలం 10 నెలల పాలనలో జగన్ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చి 1.35 లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించిందన్నారు. కూటమి ప్రభుత్వం సున్నా సంక్షేమంతో రికార్డు కెక్కిందన్నారు. తల్లికి వందనం, నిరుద్యోగ భృతి, కొత్తపెన్షన్లు, కాంట్రాక్టు ఉద్యోగాలు, మహిళలకు ఉచిత బస్సు, 50 ఏళ్లకే పింఛన్, జాబ్ క్యాలెండర్, డీఎస్సీ, వలంటీర్లకు రూ.10వేల జీతం వంటి హామీలన్నీ సున్నాగానే మిగిలాయన్నారు. అంగన్‌వాడీల వేతనం పెంపు, ఉద్యోగుల పీఆర్‌సీ, మహిళలకు నెలకు రూ.1500 చొప్పున ఆర్థిక సాయం అందని ద్రాక్షగానే మారాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్ గిరిరఘు, మాజీ కౌన్సిలర్ పిరిడి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో మన్యంకు మొండిచేయి

- జిల్లా అభివృద్ధికి రూ.10వేల కోట్లు కేటాయించాలి
- నేడు బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ కలెక్టరేట్ ఎదుట నిరసన



రాష్ట్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా పోస్టర్‌ను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

పార్వతీపురంటౌన్: జిల్లా అభివృద్ధి విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గొర్లి వెంకటరమణ మండిపడ్డారు. ప్రభుత్వం విడుదల చేసిన రాష్ట్ర బడ్జెట్‌కు నిరసనగా శుక్రవారం పార్వతీపురం సుందరయ్య భవనంలో కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో మన్యం జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులైన జంఝావతి, తోటపల్లి, గుమ్మడిగెడ్డ, వట్టిగెడ్డ ప్రాజెక్టుల పూర్తికి ఎలాంటి కేటాయింపులు లేవన్నారు. జిల్లాలోని గిరిజన ప్రాంతంలో రోడ్ల నిర్మాణానికి, మరమ్మతులకు పూర్తి స్థాయిలో నిధులు కేటాయించకపోవడం దుర్మార్గమన్నారు. జిల్లాలో పీజీ కాలేజ్, యూనివర్సిటీ, ఇంజినీరింగ్, మెడికల్ కాలేజీ తదితర సంస్థల ఏర్పాటులో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. జిల్లాలో మౌలిక వసతుల కల్పనకు, అభివృద్ధి పనులకు రూ.10వేల కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రూ. 3.22 లక్షల కోట్లతో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో సామాజిక రంగానికి, విద్య, వైద్యానికి కోత పెట్టడం విచారకరమన్నారు. తెలుగు భాష అభివృద్ధికి కేవలం రూ.10 కోట్లు కేటాయించడం తగదన్నారు. బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద శనివారం నిరసన కార్యక్రమం చేపడతామన్నారు. కార్యక్రమంలో బి.వి రమణ, పి రాజశేఖర్, నాయకులు పి. సన్యాసిరావు, బి.సూరిబాబు, ఎస్.ఉమామహేశ్వరరావు, జి.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చింతపండు కొనుగోలు ప్రారంభం

గుమ్మలక్ష్మీపురం: స్థానిక జీసీఎంఎస్ పరిధిలో గిరిజనులు సేకరించిన చింతపండును కొనుగోలు చేస్తున్నట్టు బ్రాంచ్ మేనేజర్ కృష్ణప్రసాదరావు తెలిపారు. కుంతేసు గ్రామంలో శుక్రవా రం కిలో చింతపండు రూ.36 చొప్పున 20 క్వింటాళ్లు కొనుగోలు చేశారు. వెంటవెంటనే నగదు చెల్లించారు.కార్యక్రమంలో సేల్స్‌మెన్‌లు సన్యాసిరావు, రామన్నదొర, సందీప్ పాల్గొన్నారు.

సుస్థిర ఆర్థికాభివృద్ధికి చర్యలు

- కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో సుస్థిర ఆర్థికాభివృద్ధి కోసం చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు వెనుకబడిన ప్రాంతాల్లో ఆర్థిక పురోగతిపై నీతి ఆయోగ్ సభ్యులు శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ, ఉద్యానవన, పర్యాటక, పారిశ్రామిక రంగాల్లో ఆర్థికవృద్ధి చెందేందుకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. వ్యవసాయ రంగంలో ఆర్థికవృద్ధి సాధించేలా ఐదు ముఖ్య పంటలు ఉన్నాయన్నారు. వాటిలో జీడి, అరటి, చింతపండు, పైనాపిల్, చిరుధాన్యాలు ప్రధానమని చెప్పారు. ఈ పంటలతో ఇప్పటికే అధిక లాభాలు ఆర్జిస్తున్నారని, వాటిని ప్రోత్సహించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు స్థాపించాలి

జీడి, పైనాపిల్, అరటి, చింతపండుతో పాటు ఉద్యానవన పంటలకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు స్థాపించి, మరింత మార్కెట్ ఉండేలా కృషి చేస్తున్నామని, నిమ్మగడ్డి పంటను ప్రోత్సహించడం వల్ల ఆర్థిక వృద్ధి ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే జిల్లాలో పర్యాటక రంగంలో మంచి వృద్ధి సాధించేందుకు అవకాశం ఉందని, ఆ దిశగా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఎకో, సర్క్యూట్ టూరిజంల ఏర్పాటు, పర్యాటక కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించినట్లు చెప్పారు. వాటితో పాటు పార్కుల అభివృద్ధి, వేర్‌హౌసింగ్ యూనిట్ల కల్పన, యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ వంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. పారిశ్రామికంగా జిల్లా వృద్ధి చెందేలా కారిడార్లు ఏర్పాటుచేస్తే బాగుంటుందని అభిప్రాయ పడ్డారు. జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న చర్యలతో సుస్థిర ఆదాయంతో పాటు ఆర్థికవృద్ధి ఉంటుందన్నారు. సమావేశంలో జిల్లా ప్రణాళిక అధికారి వీర్రాజు, పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ ఎంవీ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

మార్చి నెలాఖరులోగా రూ. 37 కోట్ల పనుల పూర్తి

జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులన్నీ మార్చి నెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. ఫిబ్రవరి నెలలో రూ. 26 కోట్ల మేర పనులు పూర్తి చేశారని, వాటి బిల్లులను అందజేయాలని సూచించారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో డ్వామా పీడీ రామచంద్రరావు, పీఆర్ ఇంజినీరింగ్ అధికారి బి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఏటా మూడు పంటల సాగు ప్రణాళిక



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: జిల్లాలో ఏటా మూడు పంటల సాగుకు అనుగుణంగా వ్యవసాయ ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులను ఆదేశించారు. ఏపీసీఎన్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రజాభాగస్వామ్య ప్రకృతి వ్యవసాయంపై కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. పంటలకు సమృద్ధిగా సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ నిధులతో ఫారంపాండ్స్, చెక్ డ్యాముల నిర్మాణం, చెరువుల అభివృద్ధి పనులు చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఘన, ద్రవ జీవామృతాల తయారీతో పాటు వినియోగ పద్ధతులను ప్రయోగాత్మకంగా వివరించాలన్నారు. వాటి ప్రయోజనాలను తెలియజేయాలని తెలిపారు.సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్ముఖరాజు, జిల్లా ఉద్యానవన శాఖాధికారి బి.శ్యామల, జిల్లా పశు సంవర్ధకశాఖాధికారి డాక్టర్ ఎస్.మన్మథరావు, జిల్లా గ్రామీణభివృద్ధి సంస్థ పథక సంచాలకుడు వై.సత్యంనాయుడు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాస్‌రాజు, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, విస్తరణాధికారులు, ఏపీసీఎన్ఎస్ అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన ఇండిపెండెంట్ కౌన్సిలర్



ఇండిపెండెంట్ కౌన్సిలర్ రణభేరి బంగారు నాయుడికి వైఎస్సార్‌సీపీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మున్సిపాలిటీకి చెందిన ఇండిపెండెంట్ కౌన్సిలర్ రణభేరి బంగారు నాయుడు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు సారథ్యంలో శుక్రవారం ఉమ్మడి విజయనగరం జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జి శ్రీని వాసరావును విజయనగరంలోని జెడ్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రస్తుతం పురపాలక సంఘంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులను మాజీ ఎమ్మెల్యే జోగారావు వివరించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ భవిష్యత్ కార్యాచరణపై కొన్ని కీలక సూచనలు చేశారు. అనంతరం ఒకటవ వార్డు ఇండిపెండెంట్ కౌన్సిలర్ రణభేరి బంగారు నాయుడు పార్టీ కండువా వేసుకుని పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్‌పర్సన్ కొండపల్లి రుక్మిణి, వైస్‌చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, వివిధ వార్డులకు చెందిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్‌లు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.